క్లుప్తంగా

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



లావేరులో పశువుకు టీకా వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

లావేరు: లావేరు-1, పెదలింగాలవలస సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న పెదలింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద, లావేరు పశువైద్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ బి.గాయత్రి మాట్లాడుతూ.. పాడి రైతులందరూ విధిగా తమ పశువులకు టీకాలను వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి రాకుండా ఉండటం కోసం ఈనెలాఖరు వరకూ ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్‌లు జి.లక్ష్మీకాంతం, జి.గోపాల్, సిబ్బంది ఎం.జగదీష్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: పాత 16వ నంబరు జాతీయ రహదారి నుంచి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం వరకు ఉన్న జిల్లా పరిషత్ రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయి. 650 మీటర్ల మరమ్మతులకు రూ. ఏడు లక్షలు జిల్లా పరిషత్ నిధులు మంజూరయ్యాయి. అధ్వానంగా ఉన్న రోడ్డు సమస్యను గతంలో ట్రిపుల్ ఐటీ అధికారులు జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. పంచాయతీ రాజ్ ఏఈ హేమలత పనులు పర్యవేక్షిస్తున్నారు.

రంగనాథ మండపానికి రూ. 5 లక్షల విరాళం



భూమి పూజలో జగదీశ్వరరావు దంపతులు

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో వెలిసిన రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో మండపం నిర్మాణానికి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ విశ్రాంత జీఎం పుప్పాల జగదీశ్వరరావు, జయలక్ష్మి దంపతులు ఐదు లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని రంగథ స్వామి సేవాసమితి సభ్యులకు అందజేశారు. ఈ నిధులతో పనులకు బుధవారం భూమి పూజ చేశారు. పుట్టిన ఊరికి ఏదో రూపంలో సేవ చేసే అదృష్టం దక్కిందని దాత అన్నారు. ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాటం చేస్తా..

శ్రీకాకుళం అర్బన్: వెనుకబడిన ఉత్తరాంధ్రలో గల సమస్యలపై తనవంతుగా పోరాడుతానని సిక్కోలు జలసాధన, సంరక్షణ సమితి కన్వీనర్ దుప్పల రవీంద్రబాబు అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు అతిదిగృహంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ మహానగరాన్ని మినహాయిస్తే ఉత్తరాంధ్ర అన్ని రంగాలలో అట్టడుగు స్థాయిలో ఉందన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని మేధావి వర్గం దృష్టికి తీసుకువెళ్లడానికే ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేశానని చెప్పారు. త్వరలో ఉత్తరాంధ్ర సమస్యలు-పరిష్కార మార్గాలు అనే అంశంపై చర్చా వేదికలు నిర్వహిస్తామన్నారు.

స్ఫూర్తి ప్రదాత కాన్షీరామ్



కాన్షీరామ్ విగ్రహానికి నివాళర్పిస్తున్న బీసీ, బహుజన సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఐక్యం చేసి బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసిన వ్యక్తి కాన్షీరామ్ అని బీసీ, బహుజన సంఘాల నాయకులు అన్నారు. కాన్షీరాం 89వ జయంతి సందర్భంగా జ్యోతిరావుపూలే పార్కులో ఉన్న కాన్షీరామ్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళర్పించారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని బహుజన సమాజ్ పార్టీని స్థాపించిన వ్యక్తి కాన్షిరాం అని అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, అల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కంఠ వేణు, బీసీ, బహుజన నాయకులు కొన్న కృష్ణారావు, అనంతరావు, గుణుపూరు నర్సింగరావు, బోడెలా రాజారావు, లింగాల గరికివాడు, లాస సోమేశ్వరరావు పాల్గొన్నారు.

18న వాహనాల వేలం

రణస్థలం: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనాలను ఈ నెల 18వ తేదీన వేలం వేయనున్నట్టు రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.హెచ్.కిరణ్‌మహేశ్వరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఆ రోజు ఉదయం 11 గంటల సమయంలో రణస్థలం ఎస్ఈబీ కార్యాలయం ఆవరణలో వాహనాల వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు దరావత్తుగా వెయ్యి రూపాయలు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర కాలేజీ కేంద్రం వద్ద విధుల్లో పోలీసులు



జి.సిగడాం: విద్యార్థినులకు సూచనలు చేస్తున్న కేజీబీవీ ఎస్‌వో ఉషారత్నకుమారి



శ్రీకాకుళం క్రైమ్: అధికారులకు పరీక్షల నిర్వహణపై సూచనలిస్తున్న ఎస్పీ



శ్రీకాకుళంలోని చైతన్య సహకార జూనియర్ కాలేజ్ కేంద్రం వద్ద విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం మొదలయ్యాయి. శ్రీకాకుళంతో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో 30 వరకు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నిర్ణీత సమయం ఉదయం 9 గంటలకు నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టంచేయడంతో పలుచోట్ల విద్యార్థులు ఉరుకులు పరుగులు తీశారు.

పక్కాగా ఏర్పాట్లు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలతో స్ట్రీమింగ్ విధానంతోపాటు పరీక్ష కేంద్రాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు అధికారులు పెద్దపీట వేశారు. పరిశీలకులు, ఇంటర్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఇంటర్‌బోర్డు ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ కమిటీ సభ్యులు పరీక్షలు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

పోలీస్ బందోబస్తు..

పరీక్ష కేంద్రాల వద్ద పక్కాగా 144 అమలుతోపాటు పోలీసు పహారాను మరింత పటిష్ఠం చేశారు. గతంలో ఒక్కరు మాత్రమే హాజరయ్యేవారు. ఈ ఏడాది కనీసం ఇద్దరు చొప్పున పోలీసులను మొహరించారు. మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర కాలేజీ, ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరగ్గా.. అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ అన్ని పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు.

జి.సిగడాం: జి.సిగడాంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించారు. పరీక్షలకు బయలుదేరి వెళ్లేముందు మోడల్ పాఠశాల తెలుగు అధ్యాపకుడు కె.తిరుపతిరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి ఉషారత్నకుమారి వారికి పలు సూచనలు చేశారు. పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

శ్రీకాకుళం క్రైమ్: ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పరీక్ష సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలోని చైతన్య, విశ్వవిజేత, శాంతినికేతన్, ప్రభుత్వ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాలను ఎస్పీ తనిఖీ చేశారు. సీసీ కెమెరాలలో పరీక్షల ప్రక్రియను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ కేంద్రాల ఆవరణలో బయట వ్యక్తులు ఉండకూడదన్నారు. జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 89 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించవద్దన్నారు.

పాతబస్టాండ్‌లో కార్గో సేవలు ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పాతబస్టాండ్ ఆవరణలో నూతనంగా ప్రారంభించిన కార్గో సేవలను వినియోగదారులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం పాతబస్టాండ్ ఆవరణలో పోలీసు స్టేషన్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన కార్గో పార్సిల్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ పార్శిల్ సర్వీసుకు రోజు రోజుకూ ఆదరణ లభిస్తోందన్నారు. ఎ.టి.ఎం. కమర్షియల్ హెచ్.దివ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో పార్సిల్స్, డోర్ డెలివరీ విధానాన్ని 50 కేజీల వరకు పెంచామన్నారు. కార్గో సేవలను విస్తృత పరచడానికి ఎల్‌బీఎఫ్ కౌంటర్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం 2వ డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.శర్మ మాట్లాడుతూ కార్గో/పార్శిల్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఇజాజ్, కార్గో ఏజెంట్ శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



కార్గో పార్సిల్ కేంద్రం వద్ద ఆర్టీసీ అధికారులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడాపోటీలకు హాజరైన క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలు చదువులో అంతర్భాగమేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని, క్రీడలతో ఉజ్వలభవిష్యత్ లభిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. బుధవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కోడిరామ్మూర్తి స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రగామిగా నిలవటానికి క్రీడా రంగం కూడా ఒక కారణమన్నారు. కులాలకు, ప్రాంతాలకు, మతాలకు, జాతులకు అతీతంగా క్రీడాకారులకు విశ్వవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా తగిన గుర్తింపు, గౌరవం దక్కుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. మూడేళ్లగా నిర్వహిస్తున్న ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలుచేసినట్టు గుర్తుచేశారు. నెహ్రూ యువకేంద్రం యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్ పోటీల విశేషాలను, ఏర్పాట్లను వివరించారు. విజేతలకు శ్రీకాకుళం డీఎస్పీ ఎం.మహేంద్రతో కలిసి జేసీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, సామాజికవేత్త సూర శ్రీనివాసరావు, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, జోగినాయుడు, కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేసీ, డీఎస్పీ తదితరులు

వినియోగదారుల హక్కులు పరిరక్షించాలి

శ్రీకాకుళం అర్బన్: వినియోగదారుల హక్కులు పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ ఉజ్వల్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. వినియోగదారుల హక్కులు, వినియోగదారుల చట్టం 1986 నుంచి ప్రయోజనాలు ఎలా పొందాలో వివరించారు. ఈ సందర్భంగా 'మేలుకో వినియోగదారుడా మేలుకో' అనే పేరుతో రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆసరా జిల్లా అధ్యక్షుడు గంజి ఎజ్రా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



'మేలుకో వినియోగదారుడా మేలుకో' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా సీనియర్స్ సెపక్‌తక్ర జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సెపక్‌తక్ర పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమై జిల్లాను విజయపథంలో నిలపాలని జిల్లా సెపకతక్రా అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆకాంక్షించారు. జిల్లా సీనియర్స్ మహిళల సెపక్‌తక్ర జట్టు ఎంపికలు బుధవారం శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వేదికగా జరిగాయి. హాజరైన క్రీడాకారులకు ఎమ్మెస్సార్ పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను ఈ నెల 18, 19 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సెకప్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని జిల్లా కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి తెలిపారు. అనంతరం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ ఎస్సై మహేష్‌బాబు, రాజు, వేణుగోపాల్‌రెడ్డి, బాబ్జి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, సంఘ ప్రతినిధులు

అల్పాదాయ వర్గాల అభివృద్ధే లక్ష్యం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో అల్పాదాయ వర్గాల అభివృద్ధే నేషనల్ సెంటర్ ఫర్ కో-ఆపరేటివ్ ఎడ్యుకేషన్(ఎన్‌సీసీఈ) లక్ష్యమని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎస్.సుబ్బారావు అన్నారు. నేషన్ సెంటర్ ఫర్ కో ఆపరేటివ్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ప్రతినిధులు జిల్లాలోని లేబర్స్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు నాయకత్వ అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయంలో సుబ్బారావు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, డివిజినల్ సహకార అధికారి కె.దామోదర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్నసుబ్బారావు

వైభవంగా రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: మండల కేంద్రంలోని రంగనాథస్వామి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని కమిటీ సభ్యులు బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం సుమారు పది వేల మందికి అన్నదానం చేశారు.

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సురేష్‌కుమార్ దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనుల కోసం శ్రీకాకుళం నగరానికి చెందిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ రిటైర్డ్ పరిపాలనాధికారి (ఏఓ) లుంబూరు సురేష్‌కుమార్ పట్నాయక్, అనూరాధ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు బుధవారం అందజేశారు. ఆలయ ఆగ్నేయంలో నిర్మించనున్న మెగా వాటర్ ప్లాంట్ భవన నిర్మాణంలో ఈ విరాళాన్ని వినియోగించాలని దాత కోరారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి,పక్కి తిరుపతిరావు పట్నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్యాలయం సందర్శన

గార: క్షేత్రస్థాయిలో సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, అప్పుడే ఉపాధి హామీ పథకం విజయవంతం అవుతుందని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. జాబ్ కార్డు, ఆధార్ కార్డు సమాచారం ఒకే విధంగా ఉండేలా చూడాలన్నారు. లేకపోతే వేతనం రాదని తెలియజేశారు. ప్లాంటేషన్‌లో భాగంగా పాడైన మొక్కల స్థానంలో కొత్తవి వెంటనే నాటలని సూచించారు. ఏపీఓ సి.హెచ్.సంధ్యారాణి, జేఈ నారంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు పరిశీలన

రణస్థలం: రబీలో సాగు చేసిన పంట నమోదు వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ నిమిత్తం ప్రదర్శించినట్టు ఉద్యానవన సహాయకులు లాభాల మహేష్ తెలిపారు. బంటుపల్లి ఆర్‌బీకేలో రైతుల పంట నమోదు వివరాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులంతా తమ పంట నమోదు వివరాలు సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళ రైతులు ఉన్నారు.

శారీరక దారుఢ్యంతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: శారీరక దారుఢ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని.. ప్రతి ఒక్కరూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బుధవారం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అభినందించారు. కార్యక్రమంలో బాడీబిల్డర్లు నవీ , రఫీ, శేఖర్, మదీనా, మధు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రసాద్, మనోజ్‌కుమార్ మండల పాల్గొన్నారు.

నలుగురు జూదరులపై కేసు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్ సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి రూ.18,200 స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు.

కూర్మనాథుని హుండీ కానుకల ఆదాయం రూ.15,87,315

గార: శ్రీకూర్మనాథాలయంలోని హుండీ కానుకల ఆదాయం బుధవారం లెక్కించారు. 106 రోజులకు గాను రూ.15,87,905 వచ్చిందని ఈవో జి.గురు నాథం తెలిపారు. అన్నదాన పథకం కోసం రూ. 1,01,590 ఆదాయం వచ్చినట్లు వివరించారు. సమీపంలోని పాతాళ సిద్దేశ్వర ఆలయంలోని హుండీలను లెక్కించినట్లు తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు, పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావు, పొన్నాడ రుషి, బోర కృష్ణవేణి పాల్గొన్నారు.

వంద పనిదినాలు పూర్తి చేయాలి

ఎచ్చెర్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు ఈ మాసాంతానికి వంద పనిదినాలను పూర్తి చేసేలా చూడాలని ఏపీడీ ఐ.లోకేష్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయం వద్ద క్లస్టర్‌లోని సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం, పొందూరు, ఆమదాలవలస మండలాల్లోని 11 వేల మంది వేతనదారులు వంద రోజులు పనిని పూర్తి చేయాల్సి ఉందన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ త్వరలో ముగియనున్న నేపథ్యంలో ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకూ వేతనదారులకు కొత్తగా పనులు కల్పించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి అంచనాలు తయారు చేయాలన్నారు. మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏపీవోలు, ఈసీఎస్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ లోకేష్

కట్టెజనుము సాగు పరిశీలన



కట్టెజనుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జి.సిగడాం: రైతులు వరి సాగు అనంతరం పొలాల్లో కట్టెజనుము సాగు చేసుకుంటే భూసారంతోపాటు అధిక రాబడులు సాధించగలరని వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వై.రాజశేఖర్, డాక్టర్ బి.స్వాతిపాధాలజి, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్, జి.శ్రీనివాసరావు అన్నారు. సంతవురిటి ఆర్‌బీకే పరిధిలోని విజయరాంపురం గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో రైతులు వంద ఎకరాల్లో కట్టెజనుము సాగు చేశారు. సాగు, దిగుబడులను శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కట్టెజనుము సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదన్నారు. ఎకరాకు సుమారు ఏడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. క్వింటా ధర సుమారు రూ. 7 వేలు వరకు ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

వితరణ..

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని భగవాన్ సత్యసాయి పెద్ద మందిరం పరిధిలో చదువుకుంటున్న పేద విద్యార్థుల పరీక్ష ఫీజుల కోసం పట్టణానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ అరికతోట కనకరాజు, ఉమ దంపతులు రూ.5వేలు వితరణ చేశారు. ఈ మొత్తాన్ని ఆధ్యాత్మిక సమన్వయకర్త నాగభూషణంకు బుధవారం అందించారు. సత్యసాయి పెద్ద మందిరంలో దీనజనోద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఈ మొత్తం అందజేసినట్లు కనకరాజు తెలిపారు. పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.



రూ.5 వేలు అందజేస్తున్న కనకరాజు

ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఏపీ జేఏసీ అమరావతి చేస్తున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా 8వ రోజు బుధవారం జిల్లాలోని పలుచోట్ల నిరసన తెలియజేశారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరయ్యారు. కలెక్టరేట్ వద్ద రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, కలెక్టరేట్ అధ్యక్షులు డి.సోనికిరణ్, కార్యదర్శి కె.రాజారెడ్డి నేతృత్వంలో నిరసన తెలిపారు. శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శి డి.ప్రకాశరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

జి.సిగడాం: రెవెన్యూ ఉద్యోగల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సంఘ జిల్లా నాయకురాలు నాయడుగారి నిర్మల కోరారు. బుధవారం భోజనం సమయంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వోలు బి.ఎరకయ్య, సీతయ్య, నీలకంఠం ఉన్నారు.

శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాదుస్తులను ఆవిష్కరిస్తున్న సూర శ్రీను, అధికారులు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు ఆదేశాల మేరకు గతవారం రోజులుగా శ్రీకాకుళం గ్రామీణ మండలం సానివాడ గ్రామంలో అబ్దుల్ కలామ్ ఐడియాలజీ (ఏఐఎం) ఆధ్వర్యంలో తారక్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి జూనియర్స్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. బుధవారం శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి, క్రీడామైదానంలో సూర శ్రీనివాసరావు, డీఎస్ఏ చీఫ్ కోచ్ మాధురీలత, ఎన్.వై.కె కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్ తదితరులు క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. శుక్రవారం నుంచి నెల్లూరు జిల్లా కావలిలో జరగనున్న జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు క్రీడాదుస్తులు, ప్రయాణ ఖర్చులు నిమిత్తం పీవీజీ కృష్ణంరాజు, సూర శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎం.వి.రమణ, డీటీఓ ఎన్.నారాయణరావు, శిక్షకులు ఎం.మధుసూధనరావు, కె.హరికృష్ణ, పీఎస్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైజయంతి ఉత్సవ వేదిక సిద్ధం

అరసవల్లి: ఆదిత్యాలయ ఇంద్రపుష్కరిణి వద్ద అన్ని హంగులతో పునఃప్రారంభమైన శ్రీవైజయంతి ఉత్సవ వేదిక.. జిల్లాలో కళాకారుల ప్రదర్శనలకు వీలుగా సిద్ధమైందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. బుధవారం ఉదయం ఈ ఉత్సవ వేదికను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పునఃప్రారంభించగా, సాయంత్రం వివిధ కళాకారుల గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ గతంలో ఇదే వేదికపై పలు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ..తాజాగా మరిన్ని సౌకర్యాలతో వేదికను సిద్ధం చేసామని, ధర్మపథం కార్యక్రమాలన్నీ నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం పలువురు కళాకారులు తమ ప్రదర్శనలనిచ్చారు. ఆలయ పాలకమండలి సభ్యుడు మండవల్లి రవి, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, నేతేటి హరిప్రసాద్ శర్మ, కళాకారులు బందారు చిట్టిబాబు, ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాద్, పన్నాల నర్సింహమూర్తి, గుత్తు చిన్నారావు, ప్రధాన విజయరాం, పి.ఎం.జె.బాబు, నందికేశ్వరరావు, నిక్కు అప్పన్న, హరిశ్చంద్ర తదితరులు పాల్గొన్నారు.